# తెలుగులో గిరిజన నాటకాలు–వస్తు, రూప వివేచన

డా॥పాన్‌గోత్ భగ్గు

పోస్ట్ డాక్టోరల్ ఫెలో

తెలుగు శాఖ, హైదరాబాదు విశ్వవిద్యాలయం.

***Received: Jan. 2020 Accepted: Feb. 2020 Published: Feb. 2020***

**పరిచయం:** తెలుగు సాహిత్యంలో నాటక రంగానికి విశిష్టమైన స్థానం ఉన్నదని చెప్పవచ్చు. నాటకం వినోదంతో పాటు విజ్ఞానాన్ని అందిస్తూ సామాజిక చైతన్యానికి వారధిగా ఉంటుంది. నాటకంలో మానవ జీవితాన్నంతటిని సంక్షిప్తంగా తెలపటానికి తద్వారా ప్రేక్షకుడు చైతన్యపూరిత భావజాలాన్ని గ్రహించడానికి అవకాశం ఉంటుంది. భరతుని దృష్టిలో నాటకం ఉత్తమోత్తమైన రూపకమని తెలుస్తుంది. నాటకం, నాటిక మధ్య బేధ సాదృశ్యాలున్నప్పటికీ రెండు కూడ సంగీత, సాహిత్య, చిత్ర, శిల్ప, నాట్య కలా సమాహారాన్ని అభివ్యక్తీకరించేవే. నాటకం పరిధి విస్తృతమైనది. నాటిక పరిధి చిన్నది. నాటిక చిన్నదైనా తాను చెప్పదలుచుకున్న విషయాన్ని సూటిగా, స్పష్టంగా ఇతరులకు వెల్లడి చేయటానికి బలమైన సాధనంగా పరిగణించబడుతుంది. నాటకాలు ఆలోచనలను వికసింపచేసి, మేధస్సుకు పదును పెడుతుంది. నాటక ప్రక్రియ ధ్యేయం ఆనందం కాకుండా ఆలోచన అనే విషయాన్ని నాటక రంగం కలిగించిందని చెప్పవచ్చు..

### గిరిజన నాటకాలు–వస్తురూపాలు

గిరిజనుల జీవన పరంగా పరిమిత సంఖ్యలో వెలువడిన నాటకాలలో వస్తురూప పరంగా ఏ విధంగా ఉన్నాయో పరిశీలించవలసి ఉంది. అయితే పరిశోధన పత్రం పరిధి దృష్ట్యా నాకు లభించిన నాటకాలలో 1.తేనెటీగలు పగపడ్తాయ్ 2.కట్టుబానిస 3.సులతానీ 4.అరణ్యపర్వం అనే నాటకాలను విశ్లేషణ చేస్తాను.

### 1.తేనెటీగలు పగబడ్తాయ్:

ఈ నాటకాన్ని రచించింది. కె.కె.ఎల్. స్వామి. శ్రీకాకుళం జిల్లా గిరిజనుల మాండలీకంలో రచించిన ఈ నాటికను ఫేకర్ కల్చరల్ అసోసియేషన్ గరివి, ఉమ్మడి రాష్ట్ర వ్యాప్తంగా ప్రదర్శించి ఎన్నో బహుమతులను గెల్చుకున్నారు. ఈ నాటికలోని పాత్రలు దొర, గడ్డిశెట్టి, సిమ్మడు, నారిగాడు, అదయ్య, లచ్చిగాడు, సీతాలు. కాగా టీ.మురళీకృష్ణ దర్శకత్వం వహించారు. దోపిడి వ్యవస్థలో దొర ఆగడాలను ఎదిరించి పోరాడిన గిరిజన స్త్రీ ధైర్య సాహసాలు ప్రధాన వస్తువుగా ఈ నాటికలో ఇతివృత్తం.

భూస్వామి తన దొరతనంతో గిరిజనుల్ని వడ్డీ వ్యాపారం పేరిట మోసం చేస్తూ బలవంతంగా వారి భూములను లాగేసుకొని అమాయక గిరిజన స్త్రీలపై అత్యాచారాలు చేస్తూ తనకు అడ్డం వచ్చే వాళ్ళబతుకును బుగ్గి చేస్తూ, తనకు ఊడిగం చేసే మనుషులు ఉన్నంతకాలం తిరుగే ఉండదనుకొన్న దొరల మనస్తత్వాలు ఎలా ఉంటాయో ఈ విధంగా తెలియజేశాడు.

దొర: ఒరే సిమ్మా! ఈ సెపెల్లినంత దూరం అవుపించే నేల ఎవర్దిరా?

సిమ్మా: ఇంకెవుల్ది తవర్దే దొరా!

దొర: ఒరే నారిగా! సివరవుపించకుండా పాకిపోయిన ఈ అడలెవులిదిరా?

నారా: తవర్దే దొరా!

దొర: మరే అడవిలో వున్న సెట్లు, ఆ సెట్ల మీదున్న తేనేపట్లు, సెట్టు కిందున్న పుట్టలు ఆ పుట్టల్లో వున్న పాములూ, చీమలూ ఇయ్యన్నీ ఎవురివిరా గడ్డీ!

గడిసెట్టి: ఒక్కయ్యనేమిటి బావు! ఈ సుట్టు పక్కలున్న గూడాలు, ఆ గూడాల్లో ఉన్న పాకలు, ఆ పాకల్లో ఉన్న కోకలు, రైకలూ అన్నీ తవరవే బావు(తేనేటీగలు పగబడ్తాయ్:16)

తన కంట్లో పడిన ప్రతిది తన సొంతమనే అరాచకాలు సాగిస్తున్న దొర ఆగడాలు అకృత్యాలు అదుపు లేకుండా ఉన్నాయి. తేనేపట్టు కోసం మంట పెట్టిన అదయ్యను చితక్కొట్టి, మూడవనాడు సాయంకాలం వరకు బతికున్న ఎలుగుబంటిని తెచ్చి నా గుమ్మం దగ్గర కట్టేయమని లేకపోతే నీ తలలో మేకు దించుతానని అదయ్యతో చెబుతాడు దొర. అయ్యా బతికున్న ఎలుగుబంటిని తేవడమంటే మనిషి చచ్చిపోవడమే కదా అంటే నాకే ఎదురు చెబుతావా! అని మళ్ళీ కొడతాడు అదయ్యను. దొర ఇంత అన్యాయం చేస్తుంటే ఎందుకు ఎవరు ఎదురు తిరగరని అడిగిన కోడలు సీతాలుతో "గోరం కాదొలమ్మి ఈ అడవిలో పుట్టిన పాపానికి మనకి మిగిలిన పున్నమే" అని గిరిజనుల బతుకుల తీరును అదయ్య చేత చెప్పిస్తున్నాడు నాటిక రచయిత.

దొరను చూసి భయపడకూడదన్న కోడలితో "ఒలమ్మీ! నువ్వు పల్లకలుపోయే ఆడి సంగతి నీకు తెల్దొలమ్మి తెలిత్తే నువ్వునాగ మాట్టాడనివే? ఒక్కేలి ముద్రతో అయిదు పదులు అప్పుని అయిదొందలు సెసేసి అన్యాయంగా నా భూమి పుట్రా నాగేసుకున్నాడే అప్పుడూ నానేటి అన్నేకపోనాను అదేటని అడగడానికి కెల్లిన నా పెద్ద కొడుకుని సెట్టుకు కట్టేసి కొట్టించేడే? ఆ దెబ్బ లాపనేక ఆడొల్లు వాతం కమ్మి ముద్రోజులు మంచం పట్టి సచ్చిపోనాడే అప్పుడు నానేటి అన్నేకపోనానే?....ఇంకోపాలి ఏటైనాదో నీకెరికా! కూలినేక కూదు కరువై ఆడి సేలో ఎలక బొక్కలు తవ్వి దోసెడు గింజలట్టుకొచ్చిందన్న సిన్న తప్పు సూపించి నీ యత్త కెంత నిచ్చేశాడో నీ కెరికా! కోకూడ దీయించి ఊల్లో దిగు మొలతో నడిపించాడే! ఆ అగుమానం కాయనేక అది నూతిలో పడి సచ్చిపోనాదే అప్పుడు నానేటి అన్నేక పోయినానే"(తేనేటీగలు పగబడ్తాయ్: 21) అని తన నిస్సహాయతను తెలియజేసిన అదయ్యతో మనకు తిండు కాదు, ధైర్యం కూడా కరువని మన ప్రాణాలు పోతాయని దొరకు భయపడుతున్నంత కాలం వాళ్ళు మన బలాన్ని తేనేపట్టు పిండినట్టు పిండేస్తున్నారని, మనకు అన్యాయం జరిగినప్పుడు తిరగబడాలని సీతాలుతో చెప్పిస్తాడు రచయిత.

దొర పాపం పండి పాముకాటుకి గురై చివరకు అదయ్య కుటుంబం సహాయం కోసం వస్తే నాకు చేసిన అన్యాయం, మోసానికి నేను దొరకు మంత్రమేయ్యనని అదయ్య తిరస్కరించడంతో, మన ఇంటికి సహాయానికి వచ్చి మన వల్ల చనిపోయాడని ఎందుకు అనిపించుకోవాలని ప్రాణాలిడవబోతున్న దొరకు మనం ప్రాణబిక్ష పెడుతున్నాం కాబట్టే అతడు మళ్ళీ మన మీదికి వస్తే పాపం వాడినే మింగేస్తుందని అదయ్యను ఒప్పించి పాము మంత్రం పూజలు చేయించి తన పాలు యిచ్చి దొర ప్రాణాలు నిలిపిన సీతాలుపైనే అత్యాచారానికి ప్రయత్నిస్తాడు. అప్పుడు క్షణం ఆలస్యం చేస్తే తన వాళ్ళ ప్రాణాలు పోతాయని తన జీవితం నాశనమై పోతుందని గ్రహించిన సీతాలు సరే దొర నీ ఇష్టం నీ కాళ్ళ దగ్గర ఇంత సోటు ఇవ్వమని లంగిపోయినట్టు నటించి తేనే ఉన్న కుండను తెచ్చి ఇస్తున్నట్లుగా నమ్మించి అందులో ఉన్న నల్లతాచు పాముతో కరిపించిన ధీశాలి గిరిజన స్త్రీ పాత్ర సీతాలు. తరువాత దొరకి బానిసగా మారి అయన ఏం చేప్తే అదే అని గంగిరెద్దుల తలూపే దొర బానిసలను ఉద్దేశించి "కల్లు మిటకరించి సూత్తారేరా సీము, నెత్తురు, సొవుర్యం ఉన్నాలయితే యినాగెందుకు అవకూడదని ఆనోచించండ్రా. ఒరే ఎట్టిసాకిరికి అమ్ముడుపోయిన వడుసుల్లారా మీరు పసువులు కాద్రా బుద్దిగేనం ఉన్న మడుసుల్రా. మీ వంట్లో పారుతున్నది నీరు కాదు, నెత్తురని తెలుసుకొండ్రా. సలసలకాగే నీలల్లో సెయ్యేడితే బొబ్బలెక్కుతాయే.మరి సలసలకాగే నెత్తుటిలో సెయ్యేడితే ఏమవుద్దో కనుకోండ్రా. మన బతుకులు సెట్టుకి కాసిన కాయలు గావురా, ఎవులిట్టం వచ్చినట్లు అల్లు రాలిపేసుకోడానికి సంతలో దొరికే సరుకులు కావురా! కాసులెట్టి కొనేసుకోడానికి మెతుకులకి కక్కుర్తిపడి బతుకుల్ని అమ్మేసుకోకండిరా(తేనేటీగలు

పగపడ్తాయ్.46, 47) అని కొడవలితో దొరను నరికి వేసిన ఆత్మగౌరవ, పోరాటయోధురాలు సీతాలు పాత్రను ద్వారా ఎట్టివాకిరికి అమ్ముడుపోవద్దని, ఆత్మవిశ్వాసంతో ధైర్యంగా బతకాలనే సందేశాన్ని ఈ నాటిక ద్వారా రచయిత చెబుతున్నాడని చెప్పవచ్చు.

**2.కట్టు బానిస:**

గిరిజనుల జీవితాల్లోని వెలుగు నీడల్ని, సు:ఖదు:ఖాల్ని, కష్టనష్టాల్ని, సాహితీకరించిన మారంమాయి(మహామాత), మారందాయి(పెద్దక్క)గా పేరొందిన మహాశ్వేతాదేవి బెంగాలీలో రచించిన ఆజిర్ నాటికను కొత్తపల్లి రవిబాబు, నిర్మలానంద సహకారంతో తెలుగు అనువాదం చేసి 1998లో ప్రచురించారు. ఇందులో పాటన్, గోలక్, రావణ్, గైరబీ, యజమానురాలు, మాతంగ్, లంబాడీ స్త్రీ మొదలైన పాత్రలు ఉన్నాయి. ఈ కట్టుబానిస(ఆజిర్) నాటికలో నాలుగు అంకాలు ఉన్నాయి."ఆజిర్ అంటే చాలా తక్కువ పైకానికి తనని తాను బానిసగా అమ్ముడుపోవడం" అని చెప్పడం ద్వారా ఈ నాటిక ప్రారంభమవుతుంది.

అనాటి పరిస్థితుల్లో అక్కడి వాతావరణం ఏ విధంగా ఉందో, కరువు కాటకాలు సంభవించి కూడు, గుడ్డ. నీడ లేని పరిస్థితుల గురించి ఈ విధంగా వివరిస్తున్నారు.

పడలేదు పడలేదు

చుక్క చినుకు పడలేదు

పొలాల్లో పంటలు–పొలాల్లోనే ఎండిపాయె

వందలాది ఆదివాసీలు–ఆకలితో అలమటించె

బియ్యాలు పప్పులూ–పోగుపడి ఉన్నాయి

రావణ్ సుస్రీ గోదాముల్లో నాయె

మా ముత్తాత గోలక్ కురా

పోతున్న ప్రాణాలు కాపాడుకొనేందుకు...(కట్టుబానిస:6) తమ ప్రాంతంలో ఏర్పడిన భయంకరమైన కరువు పరిస్థితులలో గోలక్ తనను, తన వంశాన్ని మూడు రుపాయలకు అమ్ముకొని ఆజిర్‌గా మారడానికి సిద్ధపడతాడు. ఎందుకంటే ఆ మూడు రుపాయలతో కొన్ని తరాల దాకా నా వాళ్ళకు నూనె, గుడ్డలూ, గూడూ దొరుకుతాయని, గంజి నీళ్ళ కోసం ఊళ్ళో తిరిగి అడుక్కునే అవసరం లేకుండా పోతుందని కరువుల మధ్య పెరిగిన గోలక్ తన వారసులను ఆజిర్లుగా అమ్ముకోవడంతో ఆదివాసీల పరిస్థితులు ఎలా ఉన్నాయో కళ్ళకు కట్టినట్లుగా నాటిక రచయిత చెప్పారు.

అయితే ఈ నాటికలో లంబాడీ స్త్రీలు పసరులు పోసి వశీకరణ చేసుకునేవి, దొంగలింపబడ్డ వస్తువులు ఫలానా చోట ఉన్నాయని కనిపెట్టేందుకు, పురిటిలో తల్లులు కని ప్రాణం పోయిన శిశువులకుతిరిగి ప్రాణాలు కాపాడే విధంగా చేస్తారని లంబాడీ స్త్రీ పాత్ర చిత్రణను చేశారు రచయిత.కట్టుబానిస అయిన పాటన్ లంబాడీ స్త్రీతో తనను తీసుకెళ్ళమని నీతో ఎక్కడికైనా వచ్చేస్తానని అంటాడు. అప్పుడు లంబాడీ స్త్రీ ఎక్కడికి తీసుకుపోను ఒక ఆజిర్ని నాతో! నువ్వెక్కడికెళ్ళినా, ఎక్కడున్నా వాళ్ళు నిన్ను పట్టి బంధించి తెచ్చి కొట్టి..కొట్టి చంపేస్తారంటుంది. అయినా పాటన్, లంబాడి స్త్రీ వేరు వేరు దారుల వెంట పారిపోతున్నప్పుడు ఊరంతా కలిసి పాటన్ పట్టుకొని బాగా కొడతారు.

ఆజిర్‌వి నువ్వు! ఆజిర్‌వి నువ్వు
నీకు విముక్తి లేదు! నీకు లేదు విముక్తి
నేను ఆజిర్‌ని! నేను ఆజిర్‌ని! నాకు లేదు విముక్తి! నాకు విముక్తి లేదు!
నీకు జీవితం లేదు! నీకు భార్య లేదు!
నాకు కొడుకు లేదు! నాకు ఆనందం లేదు!
పుట్టుకతోనే బానిసవి! పుట్టుకతోనే బానిసవి!
నీది కాదు ఈ లోకం
నీది కాదు లంబాడీ స్త్రీ
ఆజిర్ బాండు ఉన్నంత దాకా
నువ్వో గాయపడ్డ మృగానివి
మాతంగే నీ పాలిట దేవుడు
నీది కాదు ఈ లోకం

జీవితం నీది కాదు...(కట్టుబానిస:16) గుంపు చెప్పినప్పుడు లంబాడీ స్త్రీతో పారిపోతాను. లోకాన్ని చూసి నా జీవితం సార్థకత చేసుకుంటాను. నేనొక కొడుకుని కంటాను. అతనికి ఈ లోకాన్ని చూపిస్తాను అంటాడు పాటన్. కాని కాల చక్ర బంధంలో ఇరుకున్న పాటన్‌తో యజమానురాలు నేను ఆఝిర్ బాండును నీకు ఇచ్చేస్తాను నాతో వచ్చేయమని అనగానే పాటన్ గంతులేస్తాడు. చివరకు యజమానురాలు కలిసి బాండు ఎప్పుడో చీకిపోయి, ఎప్పుడో ముక్కలయి, పొడములు పోయింది. నీ ఆజిర్ బాండు లేదని ఎంత చెప్పినా వినని పాటన్ ఆమెను చంపివేస్తాడు. మాతంగ్ వచ్చి ఎందుకు చంపేశావంటే నా ఆజిర్ బాండు ఇవ్వలేదని చెప్పిన పాటన్‌తో "అది ఎక్కడి నుండి తెస్తుంది? నా కళ్ళతో నేనే చూళ్ళేదు. మా నాయనా చూళ్ళేదు బాండు ఒకానొకనాడు ఈ గావంచాలో ఉండేది ఆజిర్ బాండు. అది కాస్తి నుగ్గు, నుగ్గయి పొడములు పోయింది"(కట్టుబానిస:20) ఆజిర్ బాండు లేదనడంతో నేను ఇక లేదు అందువల్ల నేన్నేటికి బానిసను కానని ఆనందం వ్యక్తం చేస్తాడు. అందరిలాగే స్వేచ్ఛా జీవిగా బ్రతకడానికి నిశ్చయించుకుంటాడు.

**3.సుల్తానీ నాటకం:**

సులతానీ జీవిత కథలోని మలుపును సహజంగా గుండెను తాకే విధంగా తెలంగాణ యాసలో వేలూరి శివరామశాస్త్రిగారు 1962లో "సుల్తానీ" నాటిక రచించారు.ఇందులో పరమానంద, సుల్తాన్, రాంగిరి, దేవుడన్న, గాలెన్న, శాంతయ్య, పటేల్, మల్లన్న పాత్రలు ఉన్నాయి.

తెలంగాణలోని మారుమూల కుగ్రామంలో ఉన్న పూరిగుడిసెలు స్టేజి మీద కనిపిస్తుండగా ఈ నాటిక ప్రారంభమవుతుంది. తల్లి తండ్రి లేని స్త్రీ పెండ్లి అయిన తరువాత తన భర్తే సర్వస్వం అనుకొని బతుకుతుంటే భర్త పెట్టే బాధలు అంతా ఇంతా కాదు. ఊరు, పేరు లేని స్త్రీ తనకింతా భర్త తోడు కావాలని కోరుకుని ఎన్ని కష్టాలైనా భరిస్తుంటే అదే అవకాశంగా తీసుకున్న పురుషహంకారి, చెప్పుడు మాటలు విని తన భార్యను పెట్టే హింస పల్లెల్లో భార్యాభర్తల

మధ్య జరిగే సంభాషణను తెలంగాణ మాండలికంలో చెప్పాడు రచయిత. గంజి కాయలేదని కొట్టబోయిన భర్త తిరిగి వచ్చేవరకు పొయ్యిలో మంటఅంటించి భజనవాళ్ళు వస్తే వాళ్ళతో మాట్లాడుతుండగా పొయ్యిలో గుడ్డ పడి గుడిసె కాలిపోతే సుల్తానీకి చిత్రహింసలు పెట్టి చెప్పుడు మాటల ద్వారా తన సంసారాన్ని చెడగొట్టుకున్న పాత్ర పరమానందది. అహంకారంతో వీర్రవీగితే మంచి మాటలు కూడా రుచించవని రాంగిరి ఎంత చెప్పినా వినిపించుకోని పరమానంద గాలెన్న మాటలు విని సుల్తానీతో నన్ను వదిలిపొమ్మని అంటాడు. నేను ఎక్కడికి పోలేను, నాకంటూ ఎవరూ లేరని ఎక్కడికని పోతానని సుల్తానీ అమాయకంగా అడుగుతుంది. అయినా నా దగ్గర ఉండకు పొమ్మని ఒక కాసుల హారం ఇచ్చి "ఎట్ల బత్కుతావా? ఇదిగో కాసులు అమ్ముకు దిని ఏడబత్కుతావో బత్కుపో"8అంటాడు. కనికరం లేని భర్తల మనస్తత్వాలు ఎలా ఉంటాయో ఈ విధంగా తెలియజేస్తాడు.

పర: ఏమట్లచూస్తవే? జల్దిగా చెల్లు చీట్లిచ్చి ఎల్లవాఎల్లు-లేకుంటే ఈ జెట్టుకొమ్మకు ఉరివేస్తోని యాడే జస్తను. అట్లైన నిన్ను గట్కపోతరు-గాలెన్నా తాలుర

గాలె: (వచ్చాడు)-తాలుర(చెట్లు చీట్లుదీసి-యిద్దరి చేతివేలి ముద్రలు వేయిస్తాడు. వేలిముద్రలు వేయించిన తరువాత)పరెఎల్లదుండు రగడ జేస్తావ్? మీకు మనసు గుదురదు, మాట గల్వదు. ఎవరి దారి వాళ్ళది.

సుల్తా:వద్దు-దొర-వద్దు-నే బోలేను-నే బోలేను(మూట తీసుకుని నడుస్తు వుంటుంది) నీవే సుకంగ వుండు.

పర: ఏమమ్మో మరిగల్తె అట్లనే బోతవా? ఓలె ఇచ్చి నేగట్టిన మరి ఆ తాలెబొట్టు?

సుల్తా: ఏం జేయాలె?

పర: యాడ బెట్టిపోవాలె!

గాలె: తాలి బొట్టీడ బెట్టకుంటె యీచెల్లు చీటీలు జెల్లవుగ మరి-జెప్పు.

పర:మరి! యిన్నవా మన కుల కట్టడి?

సుల్తా:తాలిబొట్టు యీడబెట్టి పోవాలె!

పర: తాలెబొట్టు యీడ బెట్టిపోకుంటె, నీకు నాకు చెల్లెట్ల అయితదే? ఎవరి పెండ్లానివే అంటే ఎవరి పెండ్లాన్నని జెప్తవ్! పెండ్లాముండగా బెండ్లామిస్తరా మరి! అందుకీడబెట్టి బోవాలె!(అని ముందుకు బోతాడు)

సుల్తా: వద్దు దొరా! ఇది గోర పాతకమన్నా! యీ సూత్రముంచండి-లేకుంటే లోకులు నన్ను జిత్ర చిత్రంగ జూస్తరు-లోకుల కండ్లు నే మూయలేను దొరా! నీ పేరు నేనేడ జెప్పను

(పరమానంద సూత్రంపై చేయివేస్తాడు)దొరా!(పెద్దగా అరుస్తుంది)నీ పెండ్లాన్నని యెవరికి జెప్ప.

పర: గాలెన్న నీవు జెప్పినట్లుగనే జేసిన-దాని సూత్రం దెంపుకొచ్చి ఎల్లగొట్టిన. నాకు జిల్కను గట్ట బెట్టాలె.

గాలె:గట్లనె...గట్లనె(తెరపడును)(సుల్తానీ:484) నన్ను ఎల్లగొట్టినవు వెళ్ళిపోతా కాని తాళిబొట్టు తెంపకుండా ఉంటే బాగుంటుందని, తాళి లేకపోతే లోకులు నన్ను చిత్రంగా చూస్తరన్న వదిలిపెట్టకుండా తాళిబొట్టును తెంపుకొని పంపించి వేస్తాడు.

ఇక రెండవ రంగంలో సుల్తానీ, సుల్తాన్‌ను పెండ్లి చేసుకొని ఉంటుంది. అయితే సుల్తానీ దగ్గరకు మొదటి భర్త అయినా పరమానంద రావడాన్ని చూసినా జోగులు, సుల్తాన్‌కు చిలువలు, పలువలుగా చెప్పడంతో శాంతయ్య దగ్గర కూలి డబ్బులు దాస్తున్నావని, మొదటి భర్త ఇచ్చిన కాసుల హారం తీసుకొని వచ్చి నాకిమ్మని కొడతాడు. డబ్బులయితే తెచ్చి యిస్తాను కాని కాసుల హారం పరమానంద ఇచ్చింది కాబట్టి అది ఆయనకే చెందాలని అంటుంది. ఆయనకే ఎందుకు చెందాలని సుల్తానిని బాగా కొట్టి వెళ్ళిపోగా, శాంతయ్య దొర ఆమెను ఓదార్చి నిన్ను మా సొంత బిడ్డలాగా చూసుకుంటామంటాడు. అంతలోనే సుల్తాన్ తాగి మళ్ళీ వచ్చి సుల్తానీని కొట్టగా ఓపిక లేక నీరసించిపోయి దాహం వేయడం వలన నీళ్ళ కోసం చూస్తూ ఉండగా అప్పుడే పరమానంద వచ్చి సుల్తానీకి నీళ్ళు అందివ్వబోగా నా పెళ్ళాన్ని తాకుతావా అని అతని మీదకి విసిరిన కత్తి పోయి పటేల్‌కు తగులుతుంది. కోపం వచ్చిన పటేల్

సుల్తాన్: తమ మీన్కి యిసర్లే ద్దొర

పటేల్: ఎవలి మీన్కి యిసిర్నవు?

సుల్తాన్:పరమానంద మీన్కి

పటేల్: ఎందు కిసిర్నవు?

సుల్తాన్: నా పెండ్లాంకు నాకు లడాయైనది. నేగొట్టెన్ను..

పటేల్: మాకొచ్చి జెప్పినవుగ!

సుల్తాన్: గింతల పరమనందొచ్చి, నీలు దాపించడం-కూకోబెట్టడం జేస్తన్నడు-గింతలోనే వచ్చిన్ను-నా పెండ్లామును వాడు ముట్కుంటడా దొరా! కోపం బట్టలేక వానిపై కత్తి యిసిర్నను. ఆ బద్మాష్ దప్కున్నడు. తమకుదగిల్నది! మన్నించాలి దొరా!

పటేల్: (తన్ని)వరె! వాడు నీ పెండ్లామును ముట్టుకుంటె మాకు జెప్పాలె- మరి మామీనకు కత్తివిసుర్తవన్నమాట! మా మీనకు(కర్రతో కొడ్తాడు)

సుల్తానీ: (అడ్డుపడుతుంది. కర్ర తలపై తగిలింది) అబ్బా! దొరా!

పటేల్: సుల్తానీ! గెంతపనిజేసినావె-గెంతపనిజేసినావ్. వానిదెబ్బ నీ వెందుకు దిన్నవ్? మల్లన్నా-సుల్తాన్ను బట్కరా-బట్కరా వాన్ని -మల్లన్న అదుగో, సుల్తాన్ ఉరుకుతున్నడు-బట్కరా వాన్ని -దానాకి బట్కరా వాన్ని

మల్లన్న: గట్లనే దొరా!!

శాంతయ్య: ఇదేమి ఖర్మమే? వాడు నిన్ను కొట్టింది చాలక వాడి దెబ్బలు కూడా నీవెందుకు తిన్నావే? ఆ త్రాగుబోతు సన్యాసి నాకెదురై చెప్పి అట్లా పారిపోతున్నాడు.(సుల్తానీ:491) భర్తతో దెబ్బలు తిని చావుబతుకుల మధ్య కొట్లాడుకుంటున్న సుల్తానీ, పటేల్ తన భర్తను కొట్టడం చూసి అతనికి ఎదురుబోయి తన భర్త సుల్తాన్‌కు బదులు తను తన్నులు తింటుంది. తనవాడని నమ్మిన భర్త కోసం తన్నులు తిని ఒక నాకు ఆ దేవుడే దిక్కని పరమానంద ఇచ్చిన కాసుల హారం అతనికే చెందాలని అంటూ తనువు చాలించిన స్త్రీ బాధాతప్త హృదయ వేదనను ప్రతిఫలించింది నాటకం.

సుల్తానీ రెండు అంకాల నాటిక. మొదటి అంకంలో మొదటి భర్త పరమానందతో కలిసి గడిపిన జీవితంతో పాటు తన పుట్టుపూర్వోత్తరాలు తెలియవు అని, తనకు తల్లిదండ్రులు లేరనే విషయాన్ని తెలియజేస్తూ, ఎక్కడికి పోలేని అభాగ్యురాలి ఆవేదనను వినని పురుషాంకారం, స్వార్థబుద్ధి, చెప్పుడు మాటలకు నాశనమయ్యే పరమానంద వ్యక్తిత్వాన్ని తెలియజేయగా, రెండవ అంకంలో సుల్తాన్‌తో జీవితం పంచుకొని ఉంటున్న సమయంలో సుల్తానీ మొదటి భర్త పరమానంద రావడాన్ని చూసిన జోగులు సుల్తాన్‌తో చిలువలు, పలువలు చెప్పి సుల్తానీ జీవితంలో అశాంతికి కారణమై చివరకు ఎవరికి ఏమి చెప్పకుండా శ్రీవేంకటేశ్వరుని కడకు చేరడంతో ఈ నాటిక ముగుస్తుంది.

**4. అరణ్య పర్వం:**

ఈ నాటిక రచయిత వాగ్దేవి. ఇందులోని పాత్రలు బుదియాడు, గార్డు అప్పారావు, అప్పలకొండ, చలమయ్య ఘుక్త, రామచంద్ర గాంధి, రచయిత, సమ్మారీ, గౌరి, నాగు, జగ్గు.

బి.వి.చంద్రశేఖరరావు దర్శకత్వం వహించగా, కింగ్ ఆర్ట్స్, విజయనగరం వారి సమర్పణలో డా॥అక్కినేని నాగేశ్వర రావు నాటక కళా పరిషత్ తృతీయ రాష్ట్ర స్థాయి నాటిక పోటీలలో ప్రదర్శించబడింది.

ఈ నాటికలో రచయిత చైతన్య ఒక పాత్రధారిగా ప్రవేశించి శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో ఉన్నటువంటి మందస, సోంపేట, పార్వతీపురం, కురుపాం, భద్రగిరి మొదలగు ఏజేన్సీ ప్రాంతాలు తిరిగి అక్కడ సవర జాతికి చెందిన గిరిజనులు వాళ్ళ యొక్క ఆచార వ్యవహారాలు, వాళ్ళ సంప్రదాయాలు మొదలైన విషయాలు స్వయంగా తెలుసుకొని ఈ నాటికను రచించానని చెప్పడం ద్వారా అమాయక గిరిజనుల జీవనంలో నుండి వచ్చిన రచనగా చెప్పవచ్చు.

సవర జాతికి చెందిన అమాయక గిరిజనుల కష్టాలను, కన్నీళ్ళను, వారు ఆరుగాలం శ్రమించి పండించిన పంటలను, అడవి జంతువులు, క్రూర మృగాల బారి నుండి తప్పించుకొంటూ సేకరించిన అటవీ ఉత్పత్తులను గుంజుకొని వేలి ముద్రల ద్వారా గిరిజనులను దోపిడికి గురి చేస్తున్న బుగతల అరాచకాన్ని, అన్యాయాలను కళ్ళకు కట్టినట్లుగా చెప్పబడింది ఈ నాటికలో. బుగతను సహిస్తూ జీవిసుతన్న అమాయక గిరిజనులు అనుభవిస్తున్న బాధలు తెలిసి వస్తాయి.

నిరక్షరాస్యులు, అమాయకులైన గిరిజనులను మోసం చేసే తీరును ఘుక్త, బుదియాడు సంభాషణ ద్వారా తెలిపారు నాటిక రచయిత.

"దొరా! నాదీ ఆడదానికి జబ్బు చేసింది. మందులకు దుడ్డు కావాల దొరా!

తప్పకుండా ఇస్తాను. మరి మీ అంతమంచి కోసమే గదరా నేనున్నది.

ఇక్కడొక ఏలుముద్రేసియన్నా నీ పనైపోద్దిఎందుకు ఏలుముదర పవిత్రా నీకుచెప్పాలి!

యిచ్చిండబ్బులు చాల్లేదా! మొత్తం ఎంత తీసుకున్నావ్.

నాకు రెండుసారులు కోకలు యిచావు దొరా. ఒక కోక, రెండు గమంచా, మలాసారి ఒకటి కోక ఒక గమంచా యిచ్చావు గదా! బియ్యం, నూకలు, రుండుసారి యిచావు గద. మరి నాకు దుదు..ఊలేదు....

దొరా! నీ కాళ్ళకుతాను దొరా! నాది ఆడదాయికి మందు లేకపోతే అది సచిపోతది దొరా

వేలిముద్ర వేసాకా పవిత్రా! ఏమిటీ కావాలి! డబ్బులు కావాలా! యిచ్చింది చాల్లేదురా సవర్నాకొడుకా! యిప్పుడు నేనివ్వను, నీ దిక్కున్నా కాడికెళ్ళి చెప్పుకో....దొరా..దొరా..ఇపుడు గదా ఏలిముద్ర పెటితే దుడ్డు యిత్తాను అనావు..అవును

అన్నాను(జేబులో నించి రెండు రుపాయలు నోటు తీసి) ఈ యీ రెండూ తీసుకొని నీ పెళ్ళానికి బండి కట్టించి పక్క గూడెంలోని గవర్నమెంటు ఆసుపత్రికి తీసుకెళ్ళు. వెళ్ళు...ఆసుపతిరికి ఎలితే ఆకడ దుడ్డు ఎక్కువ అడుగుతరు. మందుకు దుడ్లు యిచి నాది ఆడదాయికి బతికించు దొరా..నువ్వు గుండె బద్దలు కొట్టుకున్న లాభం లేదు తీసుకో(ఆ రెండూ రుపాయలు కింద పడేసి విసురుగా వెళ్ళబోతాడు)(అరణ్యపర్వం:218)ఈ విధంగా గిరిజనులపై జరుగుతున్న దోపిడిని, అన్యాయాన్ని చూసిన రచయిత "ఎవడో బ్రిటీష్ వాడు మనల్ని బానిసల్ని చేసాడంటాం. నిజమే కానీ యిప్పుడు మనం చేస్తున్నదేమిటి? అంతకంటే అమానుషంగా, అంతకంటే పైశాచికంగా అంతకంటే హీనాతిహీనంగా వారి పట్ల మనం ప్రవర్తిస్తున్నాం! మనకి స్వరాజ్యం వచ్చి ఇన్ని యిన్ని సంవత్సరాలౌతున్నా వాళ్ళ జీవితాలు మాత్రం అలాగే అక్కడే పడున్నాయి. వారు మనతో సమానంగా ఎప్పుడొస్తారు? వాళ్ళ జీవితాలకి వెలుగేప్పుడొస్తుంది? ఈ వ్యవస్థ మారేదెప్పుడు"(

గిరిజనులను మోసగిస్తున్న బుగతను ప్రశిస్తున్న గాంధీ గిరిజనులు ఏ పరిస్థితులలో ఉన్నారో తెలియజేస్తున్న మాటలు ఈ విధంగా ఉన్నాయి. "ఒక్కసారి ఆ గూడెం ప్రజల వైపు చూడండి! కళ్ళల్లో ప్రాణాలతో రోజంతా ఎముకలు విరిగేట్టు పనిచేసినా కడుపునిండా యింత తినలేకపోతున్నారు. అడవిలో దొరికిన వస్తువులు, వాళ్ళు పండించిన పంట గింజలు అమ్మినా ఒంటి నిండా బట్ట కట్టుకోలేక పోతున్నారు. ఎందుకు? ఎందుకిలా జరిగింది!...వాళ్ళ అమాయకతనం చూసి, వాళ్ళ దగ్గర దోచుకొని మీరు మేడల్లో విహరిస్తున్నారు"(224) అని నిలదీస్తాడు. గిరిజనులలో చైతన్యం వచ్చేదాకా వాళ్ళతోనే ఉంటానని చెప్పిన గాంధీతో బుదియాడు "నాది ఆడదాయికి ఎక్కువ జబు చేసింది...అది సచిపోయింది..మేష్టుబాబూ! నాకు ఒదిలి ఎలిపోయింద"ని ఆమె మందులకు కావల్సిన డబ్బు కోసం వస్తే బుగత ఇవ్వనందువల్లే సకాలంలో వైద్యం అందక చనిపోయిందని వాపోతాడు. అరుగాలం శ్రమించి పండించిన పంట అంతా తీసుకున్న బుగతకు ధనదాహం తీరక చివరకు ఖాళీ పేపరు మీద వేలి ముద్ర వేయించుకొని డబ్బులు యివ్వకుండా వెళ్ళగొట్టిన అమానుష సన్నివేశాన్ని చిత్రించారు.

భుక్త చంపేసిన గౌరిని చూసి ఘోరున విలపిస్తున్న బుదియానుఎందుకంతగా సొంత కూతురు చనిపోయినట్టు ఏడుస్తున్నావని సిమ్మా అడుగగా "యిది సిన్న కూన అప్పుడు మూడు ఏడులు వరసగా వానలేదు. పంట లేదు. అడవి పంటమలా లేదు. కర్రలు కొట్టి కడుపు నింపుకుంటాం అంటే సరకారు ఒపుకోలేదు. ఇది రాతిరి పోగులు పలుకి ఏడుత్తాది, తిండి లేకపోతే తల్లికి పాలు ఎకడ నుండి వత్తాది అన్నా! దాని ఏడుపు సూడలేకపోయాను. దాని గోల యినలేక పోయాము. అదైనా బతుకుతాదని నాది యీ కూనకి(దు:ఖం ముంచుకొచ్చింది) రొండు కుంచము నూకలు, రొండు కొకలుకి అమ్మిసాము. యీ కూన నా సొంత కూన అన్నా! దాని అమ్మా అకడ సచిపోయింది. ఇది యికడ సచిపోయింది. నేను ఎందుకు బతకాలన్నా! ఎవులు కోసమూ బతకాలన్నా! నేను సచిపోతాను అన్నా! నాకు యీ బతుకు వొద్దు అన్నా" ( :227) అని కింద పడి దొర్లి, దొర్లి ఏడుస్తున్న బుదిమాకు నువ్వు సవరోడివి కాదురా? నీకు పౌరోసం లేదురా? ఒరే బుగత నీవొక్కడికే అన్యాయం సేయనేదురా! మనిషి రక్తం తాగి దాహం తీర్చుకుంతన్న బుగతల్ని బలివ్వాలిరా! అని చెప్పేసరికి సిమ్మా డప్పు కొడుతుండగా అప్పలకొండ, గారుడ అప్పారావు సహకరిస్తుండగా పులి వేషం వేసిన బుదియా బుగతను చంపేసి వాడి అరాచకాల నుండి స్వేచ్ఛను పొందుతారు.

విజ్ఞానవంతులైన యువతీ యువకులారా! మేధావులారా! ప్రేక్షకులారా! మీరు సముపార్జించిన విజ్ఞానాన్ని అమాయకులైన ఈ గిరిజనులకు పంచిపెట్టి, వాళ్ళను ఈ అరణ్య పర్వం నుండి అభ్యుదయ పథానికి మళ్ళించండి!...అభ్యుదయ పథానికి మళ్ళించండి! అనే సందేశంతో ఈ నాటికను ముగించడం నేటితరం బాధ్యతను నాటిక రచయిత గుర్తు చేస్తున్నాడు.

**ముగింపు:** గిరిజన జీవనం ఇతివృత్తంగా వెలువడిన ఈ ఐదు నాటకాలలో వస్తుపరంగా పరిశీలించినప్పుడు సులతానీ నాటకంలో ఒక లంబాడీ స్త్రీ బతకడం కోసం హింసను భరిస్తూ, కట్టుకున్న భర్తకోసం తాను దెబ్బలు తిన్నా కూడా కనికరం లేని భర్తల హింసలకు విసుగు చెంది తన జీవితాన్ని చాలించుకున్న వ్యధాభరిత గాథను చాలా హృద్యంగా చెప్పడం ఈ నాటకంలో కనిపిస్తుంది. తేనేటీగలు పగపట్టాయ్ నాటకంలో భుస్వామ్య దొరలు అమాయకమైన గిరిజనులను ఏ విధంగా పీల్చి పిప్పి చేస్తున్నారో చెబుతూనే, తన ప్రాణాలను కాపాడిన స్త్రీపై అత్యాచారానికి ప్రయత్నించిన దొరపై తెలివితో అతనిని మట్టుబెట్టిన గిరిజన స్త్రీ, పరాక్రమాన్ని చైతన్యవంతులు కావల్సిన అవసరాన్ని తెలియజేసింది. పేదరికంలో మగ్గుతున్న గిరిజనుల ఆకలిని ఆసరాగా చేసుకొని బానిసలను చేసుకొన్న దొరల నుంచి విముక్తమయిన గాథను కట్టుబానిస నాటకం తెలుపుతుంది. అరణ్యపర్వం నాటికలో దొర చేసిన అన్యాయాలు, అక్రమాలను గుర్తించిన గిరిజనులు చైతన్యవంతులై దొరను మట్టుబెట్టిన విధానాన్ని తెలియజేసింది. ఈ విధంగా గిరిజన జీవనాన్ని వస్తుపరంగా అధ్యయనం చేసినప్పుడు ఇప్పటి వరకు వెలువడిన గిరిజన నాటకాలు పరిమితంగానే ఉన్నాయి. గిరిజనుల జీవన ప్రతిఫలంగా వివిధ కోణాలలో ఇంకా అనేక నాటకాలు, నాటికలు రావల్సిన అవసరం ఎంతైనా ఉంది.

***